# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 06-10-2016**

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగానే తెలంగాణలో పోలీస్ శాఖ కూడా పునర్వ్యవస్థీకరణ కావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. కొత్తగా వచ్చే జిల్లాలు, డివిజన్లు, మండలాల ఆధారంగా పోలీసు శాఖ కూడా తమ కార్యాలయాలు దసరా రోజే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొత్త పోలీస్ స్టేషన్ల నుంచి కొత్త కమీషనరేట్ల దాకా అన్నీ సిద్ధం కావాలని చెప్పారు. తెలంగాణలో పోలీస్ శాఖ పునర్వ్యవస్థీకరణపై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి బుధవారం సమీక్ష జరిపారు. హోంశాఖ మంత్రి నాయిని నర్సింహరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, సీనియర్ పోలీస్ అధికారులు మహేందర్ రెడ్డి, మహేశ్ భగవత్, సందీప్ సుల్తానియా, సుధీర్, నాగిరెడ్డి, అకున్ సబర్వాల్, సిఎంవో ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, శాంతికుమారి, స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నేరం చేసి బయటకు పోలేము అనే పరిస్థితి నేరగాళ్లకు కలగాలని, నేరాలను పూర్తి స్థాయిలో అదుపు చేసే లక్ష్యంతో వ్యూహాత్మకంగా పోలీస్ శాఖ పునర్వ్యవస్థీకరణ జరగాలని చెప్పారు. నేరాలు తగ్గాలని, ప్రజలకు భరోసా కలగాలని, ఎక్కడ అవసరం అయితే అక్కడికి నిమిషాల్లో చేరుకునేలా పోలీస్ శాఖ సిద్ధంగా ఉండాలని సిఎం చెప్పారు. అన్ని రకాల నేరాలను అదుపు చేయగలిగే రీతిలో క్షేత్రస్థాయిలో పోలీస్ వ్యవస్థను వ్యూహాత్మకంగా తీర్చిదిద్దాలని చెప్పారు. భవిష్యత్ అవసరాలు, పరిణామాలను కూడా అంచనావేస్తూ పోలీసు శాఖ పునర్వ్యవస్థీకరణ జరగాలన్నారు. అవసరమైన ప్రతీ చోట హెలిప్యాడ్ కూడా ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో హెలిక్యాప్టర్ల ద్వారా గస్తీ నిర్వహించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండేవిధంగా వ్యవస్థను తయారు చేసుకోవాలని చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, వరంగల్ కమీషనరేట్లతో పాటు కొత్తగా కరీంనగర్, నిజామాబాద్, సిద్ధిపేట, రామగుండం పోలీస్ కమీషనరేట్లను ప్రారంభించాలని చెప్పారు. ఆయా కమిషనరేట్ల పరిధిలోని జిల్లా కేంద్రాల్లో డీసీపీలను, డివిజన్ కేంద్రాల్లో ఎసిపిలను నియమించాలని ఆదేశించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడే పరిపాలనా విభాగాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 25 సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాలు, 28 పోలీస్ సర్కిల్ కార్యాలయాలు, 86 కొత్త

పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, వీటిలో అవసరమైన సిబ్బందిని నియమించాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 119 మండలాలు వచ్చే అవకాశం ఉందని, వీటిలో ఇప్పటికే 33 చోట్ల పోలీస్ స్టేషన్లున్నాయి కాబట్టి, కొత్తగా 86 స్టేషన్లు ప్రారంభం కావాలని చెప్పారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడినప్పుడు శాఖాపరంగా తీసుకున్న చర్యలను ఇతర రాష్ట్రాలలో అధ్యయనం చేయాలని కూడా సిఎం కోరారు.

పోలీస్ స్టేషన్లు, జనాభా నిష్పత్తిలో తెలంగాణ మెరుగు

-----------------------------------------------

నేరాల అదుపులో, అసాంఘిక శక్తులను అరికట్టడంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు మంచి పేరు వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు. పోలీస్ కమీషనరేట్లు, జిల్లా పోలీసు కార్యాలయాలు, సబ్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా దేశ సగటుకన్నా తెలంగాణ సగటు మెరుగ్గా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ వ్యాప్తంగా 125 కోట్ల జనాభాకు 12,806 పోలీసు స్టేషన్లున్నాయని, ప్రతీ 97 వేలకు ఒక పోలీస్ స్టేషన్ ఉందని చెప్పారు. తెలంగాణలో పునర్వ్యవస్థీకరణలో భాగంగా పోలీస్ స్టేషన్ల సంఖ్య భారీగా పెంచుతున్నందున ప్రతీ 50 వేల మందికి ఒక పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. తెలంగాణ జనాభా 3.60 కోట్లుంటే 709 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు అవుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ సగటుకంటే తెలంగాణ సగటు మెరుగ్గా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దీనికి అనుగుణంగా పోలీసు అధికారులు, సిబ్బంది సంఖ్య పెరుగుతుందన్నారు. దీని వల్ల శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రులకు జిల్లాలను ప్రారంభించే బాధ్యతలు

---------------------------------------

సిఎం కేసీఆర్: సిద్దిపేట, మెదక్ (ఈ కార్యక్రమాల్లో మంత్రి హరీష్ రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొంటారు)

మండలి చైర్మన్ స్వామి గౌడ్: జనగామ

అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి: భూపాలపల్లి

డిప్యూటీ సిఎం మహమూద్ అలీ: జగిత్యాల

డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి: వరంగల్ రూరల్

నాయిని నర్సింహారెడ్డి: యాదాద్రి

ఈటెల రాజెందర్: పెద్దపల్లి

పోచారం శ్రీనివాసరెడ్డి: కామారెడ్డి

టి. పద్మారావు: మంచిర్యాల

పి. మహేందర్ రెడ్డి: వికారాబాద్

కెటి రామారావు: సిరిసిల్ల

జోగు రామన్న: ఆసిఫాబాద్

జి. జగదీష్ రెడ్డి: సూర్యాపేట

తుమ్మల నాగేశ్వర్ రావు: కొత్తగూడెం

ఎ. ఇంద్రకరణ్ రెడ్డి: నిర్మల్

తలసాని శ్రీనివాసయాదవ్: గద్వాల

సి. లక్ష్మారెడ్డి: నాగర్ కర్నూల్

అజ్మీరా చందూలాల్: మహబూబాబాద్

జూపల్లి కృష్ణారావు: వనపర్తి

సి.ఎస్. రాజీవ్ శర్మ: మల్కాజిగిరి (మేడ్చల్)

కార్యాలయాల నిర్మాణాలకు రెండు వేల కోట్లు
------------------------------------------

కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటుతోనే సరిపోదని, అవి సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఏడాదిలోగా జిల్లా కార్యాలయాలతో పాటు మండల స్థాయి కార్యాలయాల నిర్మాణం కూడా పూర్తి కావాలని చెప్పారు. ఇందుకోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని, వచ్చే బడ్జెట్లో కార్యాలయాల నిర్మాణం కోసం రెండు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని సిఎం ప్రకటించారు. పోలీసు కార్యాలయాలను పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ద్వారా, ఇతర కార్యాలయాలను ఆర్ అండ్ బి ద్వారా నిర్మిస్తామని వెల్లడించారు. దసరా నాడే జిల్లా కేంద్రాల్లో అన్ని శాఖల కార్యాలయాలు కూడా ప్రారంభం కావాలని ఆదేశించారు. కొత్త పరిపాలనా విభాగాల్లో పనిచేయడానికి అవసరమైన సిబ్బంది కేటాయింపు తొందరగా పూర్తి కావాలని చెప్పారు.

హైపవర్ కమిటీ నివేదిక తర్వాత తుది రూపు
------------------------------------------

కె. కేశవరావు నాయకత్వంలో ఏర్పాటైన హైపవర్ కమిటీ 7వ తేదీన నివేదిక ఇస్తుందని, అప్పుడు ఏ జిల్లాలో ఏ మండలాలు, ఏ డివిజన్లు ఉంటాయనే విషయంలో స్పష్టత వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. నివేదిక వచ్చిన తర్వాత డివిజన్లు, మండలాల విషయంలో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు.

అక్టోబర్ 7న మంత్రివర్గ సమావేశం

---------------------------------

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో ఈ నెల 7న మద్యాహ్నం 2 గంటలకు సెక్రటేరియట్లో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగుతుంది.

**సిపిఆర్ఓ టు సిఎం**